నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభిస్తాం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 22 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి కేంద్రంలో త్వ రలో సమకాలిన కళా ప్రక్రియలకు ఆధునీకతను జోడించి యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వీసీ ఆచార్య టి. కిషన్‌రావు వెల్లడించారు. తెలుగు వర్సిటీ డిజైన్ విభాగం విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన వస్తుప్రదర్శనశాలను వీసీ కిషన్‌రావు ప్రారంభించారు. తక్కువ రుసుముతో వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న సంప్రదాయ కళలను విద్యార్థులకు నేర్పించడం ద్వారా స్వయంఉపాధి కల్పించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ

కాచిగూడ, మార్చి 22 : బాలికలు కరాటేను నేర్చుకోవడానికి ముందుకు రావాలని వరల్డ్‌రికార్డ్స్ హోల్డర్, కరాటే మాస్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి అన్నారు. హోలిని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 31వ తేదీ వరకు మహిళలు, బాలికలకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కరాటే ఆవశ్యకతను వివరిస్తూ మెళకువలను నేర్పిస్తూ, ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ కోసం 94941 12424లో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాచిగూడ, మార్చి 22 : రాజకీయాలకు అతీతంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. లాల్‌బహదూర్ స్కూల్, తదితర బస్తీల్లో శుక్రవారం పాదయాత్ర నిర్వహించి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, కనీస సదుపాయాలను కల్పించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, ఓంప్రకాశ్, ఆర్.సంతోష్, భీంరాజ్, సూలం రవియాదవ్,రామకృష్ణ పాల్గొన్నారు.

నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ , బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

ఇంకుడు గుంతలు నిర్మించి నీటిని పొదుపు చేయాలని అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బేగంపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంతలను పరిశీలించి అవగాహన కల్పిస్తున్న బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య ఇతర అధికారులు

బేగంపేట్/సికింద్రాబాద్, మార్చి 22: ఇంటి నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకొని నీటిని సంరక్షించుకోవాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య సూచించారు. శుక్రవారం వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకొని బేగంపేట్ సర్కిల్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మూడు వందల గజాల కంటే ఎక్కువ ఉన్న ఇంటి నిర్మాణాల వద్దకు వెళ్లి ఇంకుడు గుంతలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. వీటితో పాటు ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ కనెక్షన్లు, ఎలక్ట్రిసిటీ నెంబర్‌లను తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జల మండలి అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఇంకుడుగుంత ఉండాలి

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ పిలుపునిచ్చారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఆయన జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ కార్యాలయంలో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణంపై సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు 300 గజాల కంటే ఎక్కువ స్థలం ఉన్న ఇంటి వద్ద కచ్చితంగా ఇంకుడు గుంత ఉండేవిధంగా చూడాలన్నారు.

అలాగే ఇంకుడు గుంతలు, నీటి వినియోగంపై కర పత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో టీబీపై అవగాహన కల్పిస్తూ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరికీ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని టీబీ సోకిన వారు ఎలాంటి అధైర్య పడకుండా తగిన మందులు వాడితే.. వ్యాధి నయమవుతుందని గాంధీ సూపరిడెంటెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్యులు కృష్ణమూర్తి, జయకృష్ణ, రాములు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.– బేగంపేట్, మార్చి 22:

సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

బొల్లారం,మార్చి 22:కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు,ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని సూచించారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీ గణేష్,వెన్నెల గద్దర్,జంగయ్య యాదవ్,రవీందర్ గుప్తా,బండి రమేష్,సుధీర్‌రెడ్డి, నక్కా ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుకు సహకరించండి

తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరిన జిల్లా సాధన సమితి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

బేగంపేట్/సికింద్రాబాద్, మార్చి 22: సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నూతనంగా సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ శుక్రవారం జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను 40 జీహెచ్‌ఎంసీ డివిజన్‌లతో కూడిన సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు అశోక్, కృష్ణ సాగర్ ముదిరాజ్, సునీల్, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు ఇంటింటా సర్వే

సికింద్రాబాద్,మార్చి 22: కుష్ఠు వ్యాధి నివారణ కోసం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని సీతాఫల్‌మండి యూపీహెచ్‌సీ ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ సక్కుబాయి తెలిపారు. శుక్రవారం సీతాఫల్‌మండి యూపీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తిస్తున్నారు. గుర్తించిన కుష్ఠు వ్యాధి గ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై ఇప్పటికే వైద్యులు పలు సలహాలు, సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

మల్కాజిగిరి, మార్చి 22: అనుమానాస్పదస్థితిలో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎంహెచ్‌ఆర్ కాలనీకి చెందిన మధుసూదన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుంటాడు. అతడి భార్య కవితా రెడ్డి(28), సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తుంది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబానికి సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి.

కవితారెడ్డి మానసికంగా ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ మార్చురీకి తరలించారు.

దేశాభివృద్ధికి కృషి చేయండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

స్థానికులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, మార్చి 22: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర క్యాబినెట్ మంత్రి జి కిషన్‌రెడ్డి శుక్రవారం పద్మారావు నగర్‌లోని అపార్ట్‌మెంట్ వాసులు, వివిధ కమిటీ సభ్యులను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధాని మోదీ ఆశయాలకు అందరూ చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీకి ఓటు వేసి దేశాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం

వారాసిగూడలోని సాయి అమ్ములు ఆసుపత్రి వద్ద శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అమ్ములు ఆసుపత్రి డాక్టర్ మృణాళిని ప్రారంభించారు.ప్రతి వారం శుక్ర,శనివారాల్లో తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో రోడ్లపై ఉన్న అనాథలకు అన్నదానం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహదేవన్ రవి తదితరులు పాల్గొన్నారు.
– సికింద్రాబాద్,మార్చి 22:

ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు

అంబర్‌పేట, మార్చి 22 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. డబ్బు, మద్యం, నిషేధిత వస్తువుల రవాణాపై తనిఖీ జరుగుతున్నాయి.

సివిల్ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేస్తున్నారు. ఒక వ్యక్తి రూ.50 వేలు మాత్రమే తన వద్ద ఉంచుకొని తరలించే వీలుంది. ఎక్కువ ఉంటే ప్రతి రూపాయికి లెక్క చూపాల్సి ఉంటుంది.

బీజేపీ అడ్డగుట్ట ఇన్‌చార్జ్‌గా సీహెచ్ కన్నాభిరామ్

ఇంచార్జ్‌గా నియమితులైన కన్నాభిరామ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట, మార్చి 22 : బీజేపీ అడ్డగుట్ట డివిజన్ ఇన్‌చార్జ్‌గా తుకారాం గేట్ ప్రాంతానికి చెందిన సీహెచ్ కన్నాభిరామ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ బీజేపీ నాయకులు శుక్రవారం అతడిని కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం కన్నాభిరాం మాట్లాడుతూ... పార్టీశ్రేణులను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధితో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేందర్, నరేందర్, వీరేష్, సాయిబాబా, వేణుగోపాల్, హంసరాజు, శ్రీధర్, శివలింగం, సాయన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

శామీర్‌పేట, మార్చి 22 : సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం లాభసాటి అని రైతు శిక్షణ కేంద్రం రాజేంద్రనగర్ ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని రైతు వేదికలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల ఉపయోగంతో భూమి సారవంతం కోల్పోతుందని దిగిబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడంతో తక్కువ ఖర్చుతో పాటు కలుషితం లేని ఆహారంతో పాటు భూమి సారవంతాన్ని కాపాడుకోవచ్చునన్నారు. గోమత పేద, మూత్ర అద్భుతాలను సృష్టించవచ్చునని తెలిపారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిగలకు టిక్కెట్లు ఇవ్వాలి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

బాలంరాయ్ క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన మాదిగల ఆత్మగౌరవ రౌంట్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, మార్చి 22: అన్ని రాజకీయ పార్టీలు కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో మాదిగలకు టిక్కెట్లను కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కంటోన్మెంట్ ఇన్‌చార్జిలు ఇటుక శ్రీకిషన్ మాదిగ, నరేంద్రబాబు మాదిగ, ఇటుక గోపి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మాదిగలు పిలుపునిచ్చారు. శుక్రవారం బాలంరాయ్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన మాదిగల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కంటోన్మెంట్ ఎస్సీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో అత్యధిక జనాభా కల్గిన మాదిగలకు అన్ని ప్రధాన పార్టీలు టిక్కెట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు డీబీ. దేవేందర్ (దేవుడు), పరుశరాం, గజ్వేల్ భరత్, అజిత్ కల్యాణ్, శంకర్, జైనపల్లి శ్రీకాంత్, విజయానంద్, లింగం, విజయ రామరావు, జనగాం నర్సింగ్, చెట్టిపల్లి శ్రీను, ఇప్పల రాములు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి గ్లూకాన్–డీ ప్యాకెట్లు పంపిణీ

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ ట్రాఫిక్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి డీ హైడ్రేషన్‌కు గురికాకుండా గ్లూకాన్–డీ,మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు.
– బొల్లారం,మార్చి 22

కవులు ప్రజలను చైతన్యవంతం చేయాలి

కవి సమ్మేళనంలో పాల్గొన్న కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మార్చి 22 : కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పిలుపునిచ్చారు. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలా సాహితీ సమితి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ వి.డి. రాజ్‌గోపాల్ రచించిన 'అక్షరాలు అవే .. భావాలు ఎన్నో ' కవితా సంపుటి పై అతిథులు మాట్లాడారు. ఈ సందర్భంగా కవులు తమతమ కవితలు వినిపించిన అనంతరం నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, జెల్దీ విద్యాధర్, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, శ్రీనివాస్‌గౌడ్, దామోదర చారి పాల్గొన్నారు.

కమనీయంగా శ్రీనివాసుడి కళ్యాణం

జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆమోదగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 36వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాస కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి దంపతులతో పాటు వైస్ చైర్ పర్సన్ ప్రీతారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సంగీతారెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీవారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.
– బంజారాహిల్స్,మార్చి 22

స్పా సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

హిమాయత్‌నగర్, మార్చి 22: స్పా సెంటర్లలో నారాయణగూడ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎస్సైలు నరేశ్‌కుమార్, షపీ, శిరీషతో పాటు పోలీస్ సిబ్బంది శుక్రవారం నారాయణగూడ, హిమాయత్‌నగర్, విఠల్‌వాడీ, హైదర్‌గూడ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు.

ఏడు స్పా సెంటర్లలో లైసెన్స్‌లు, లైటింగ్ సక్రమంగా ఉందా లేదా, రిజిస్టర్‌లో కస్టమర్ల వివరాలు నమోదు వంటి వాటిని పరిశీలించారు. స్పా సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెక్నోనెన్స్ సింపోజియంను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ, ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీ

'ఇగ్నైట్'లో ఓపెన్ క్యాస్ట్ గని నమూనా

ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ సింపోజియం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలలో వేర్వేరు పేర్లతో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ (సింపోజియం) ప్రారంభమయ్యాయి. ఈ సింపోజియంలో భాగంగా విద్యార్థులు పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు శుక్రవారం ప్రారంభమై రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ పోటీలలో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సింపోజియంలను అధ్యాపకులతో సంబంధం లేకుండా ఆయా విభాగాల విద్యార్థులే నిర్వహించారు. విద్యార్థుల అభిప్రాయాలు, పరిశోధనల అనుభవాలను ఒక వేదికపై తీసుకువచ్చేందుకు ఈ సింపోజియంలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టీమ్ వర్క్, ప్రణాళిక, నిధుల సేకరణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే నేర్చుకోవచ్చని చెబుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 22:

'ఆకృతి'లో చంద్రయాన్ నమూనా